సాక్షి నారాయణపేట

గురువారం । 9 । అక్టోబర్ । 2025



నేటినుంచి నెట్‌బాల్ టోర్నీ
మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో గురువారం నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ జరగనుంది.
-8లో ▸



నిలకడగా వరద
ప్రియదర్శిని జూరాల జలాశయానికి బుధవారం ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగిందని అధికారులు వివరించారు.
-8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.4/22.2
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాంకేతికతను వినియోగించుకోవాలి



నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎంశ్రీ పాఠశాలలో కొత్తగా ప్రవేశపెడుతున్న ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ), వీఆర్ (వర్చువల్ రియాలిటీ) విధానంతో పాఠ్యాంశాలను విద్యార్థులు ప్రత్యక్ష అనుభూతితో నేర్చుకుంటారని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని కోటకొండ, దామరగిద్ద మండలం కాన్కుర్తి, మరికల్, వడ్వాట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మక్తల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ప్రయోగశాలలను ఆయన లాంఛనంగా ప్రారంభించి ఈ విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఏఎంఓ మాట్లాడుతూ.. ఏఆర్, వీఆర్ ద్వారా పాఠ్యపుస్తకాల్లో ఉన్న కంటెంట్‌ను చక్కగా అభివృద్ధి చేశారని, విద్యార్థులు డివైస్‌ల ద్వారా ప్రత్యక్ష అనుభూతితో చూసే అవకాశం ఉంటుందని, పాఠ్యాంశాలను ఎక్కువ కాలం గుర్తుంచుకొని సులభంగా నేర్చుకునేందుకు దోహదపడుతుందని వివరించారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ రాజేంద్రకుమార్, యాదయ్య శెట్టి, డీఎస్ఓ భానుప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్ అరుణ్, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

మన్యంకొండ ఆదాయం రూ.30.36 లక్షలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మన్యంకొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కించగా రూ.30,36,630 ఆదాయం వచ్చింది. మూడు నెలల కాలం (జూలై 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు)లో ఈ ఆదాయం దక్కినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాసరాజు, ఇన్‌స్పెక్టర్ వీణాధరణి, పాలక మండలి సభ్యులు అలహరి రామకృష్ణ, వెంకటాచారి, అలివేలమ్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచన..!

- టెండర్లు పెంచడానికి దుకాణాల వారీగా అమ్మకాల వివరాలు వెల్లడి
- సోషల్ మీడియాలో వివరాల నమోదు.. వ్యాపారులను ఆకర్షించే ప్రయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 227 మద్యం దుకాణాలకు బుధవారం 41 టెండర్లు దాఖలయ్యాయి. ఇందులో మహబూబ్‌నగర్‌లో 17, నారాయణపేటలో 4, వనపర్తిలో 2, నాగర్‌కర్నూల్‌లో 17, జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒక టెండర్ వచ్చాయి. 12 రోజుల తర్వాత వనపర్తి, గద్వాల జిల్లాలో దరఖాస్తుల ఖాతా ప్రారంభం కావడం విశేషం. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్, పేటలో కలిపి 21, నాగర్‌కర్నూల్‌లో 41, వనపర్తిలో రెండు, గద్వాల జిల్లాలో ఒకటి కలిపి.. మొత్తం 65 టెండర్లు వచ్చాయి. కాగా.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఆశించినస్థాయిలో దరఖాస్తులు రావడం లేదని ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారుల్లో టెండర్లు వేయడంలో ఆసక్తి పెంచడానికి వినూత్నంగా ఆలోచనలు మొదలుపెట్టారు. ఈ రెండేళ్ల కాలంలో దుకాణాల వారీగా జరిగిన మద్యం అమ్మకాల వివరాలను సోషల్ మీడియా, వాట్సాప్‌లలో షేర్ చేస్తున్నారు. దీంతో దుకాణాల వారీగా రెండేళ్ల కాలంలో జరిగిన మద్యం అమ్మకాల ఆధారంగా వచ్చిన లాభాలపై లెక్కలు వేసుకుని టెండర్లు వేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలం జోరుగా సాగింది. రెండు వారాలుగా మార్కెట్‌కు సెలవుల కారణంగా ఉల్లి వేలం నిర్వహించలేదు. ఈ వారం ఉల్లి వేలం దాదాపు వేయి బస్తాల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. వేలంలో ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,950 ధర పలికింది. రెండు వారాల క్రితం కంటే రూ.250 ఎక్కువ ధర వచ్చింది. కనిష్టంగా రూ.1000 వరకు పలికింది. కాగా.. మధ్యాహ్నం మార్కెట్‌లో జరిగిన టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు రూ.5,622, హంస ధాన్యం క్వింటాల్‌కు రూ.1,719గా ఒకే ధర నమోదయ్యాయి.

వీడని సందిగ్ధం..

తొలి విడతకు సమాయత్తం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నేటినుంచి నామినేషన్ల పర్వం

- ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరణ
- ఈ నెల 11 వరకు తుది గడువు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో 39 జెడ్పీటీసీ, 426 ఎంపీటీసీ స్థానాలకు తొలి విడత ఎన్నికలు
- బీసీ రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ



తొలి విడత ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నామినేషన్ల స్వీకరణ : అక్టోబర్ 9 (గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)

తుది గడువు :	పరిశీలన :	అప్పీల్‌కు చివరి తేదీ :
అక్టోబర్ 11	అక్టోబర్ 12	అక్టోబర్ 13

ఉపసంహరణ :	పోలింగ్ :
అక్టోబర్ 15	అక్టోబర్ 23

ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి: నవంబర్ 11

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల నుంచి అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. మొత్తం రెండు విడతల్లో ప్రాదేశిక ఎన్నికలను నిర్వహించనుండగా.. గురువారం నుంచి తొలివిడత ఎన్నికలకు నామినేషన్ల పర్వం మొదలుకానుంది. శనివారం తుది గడువు ఉండటంతో నామినేషన్ల దాఖలుకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది.

షెడ్యూల్ ప్రకారం నిర్వహణ..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు గత నెల 29న రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో, తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఇందులో భాగంగానే గురువారం నుంచి తొలి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం మొదలు కానుండగా ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో తొలి విడత ఎన్నికలు నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లకు రిటర్నింగ్ అధికారిగా జిల్లాస్థాయి అధికారి, ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారిగా ఎంపీడీఓ వ్యవహరించనున్నారు.

మూడు రోజులే గడువు..

తొలి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 11 వరకే తుది గడువు ఉంది. గురువారం నుంచే నామినేషన్లను అధికారులు స్వీకరించనుండగా ఆయా స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులు మంచిరోజు, ముహూర్తాలను బట్టి నామినేషన్లను దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. మరోవైపు గురువారమే బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉండటంతో శుక్ర, శనివారాల్లోనే ఎక్కువ మంది నామినేషన్లు వేసే అవకాశం కనిపిస్తోంది.

తొలివిడత ఎన్నికలు జరగనున్న స్థానాలు

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీటీసీ
మహబూబ్‌నగర్	8	89
నాగర్‌కర్నూల్	10	115
వనపర్తి	8	71
జోగుళాంబ గద్వాల	5	69
నారాయణపేట	8	82
మొత్తం	39	426

కొనసాగుతున్న ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించింది. దీనిపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా తీర్పు గురువారానికి వాయిదా పడింది. గురువారం సాయంత్రానికి రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో గురువారం ఉదయం 10.30 నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండగా.. బీసీ రిజర్వేషన్ల అమలుపై ఇంకా సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందోనన్న అయోమయం ఆశావహుల్లో నెలకొంది. తొలి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ప్రారంభమైనా ఇప్పటివరకు ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థిత్వాలను ఖరారు చేయలేదు. రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు తీర్పు నేపథ్యంలోనే పార్టీలు అభ్యర్థిత్వాలను పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో గురువారం నుంచి ఎన్నికల నామినేషన్లు మొదలవుతున్నా ప్రధాన రాజకీయ పార్టీల తరపున నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపించడం లేదు.

నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణపేట: జిల్లాలో మొదటి విడత జరిగే 8 జెడ్పీటీసీ, 82 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పటా్నయక్ వివరించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ప్రతి మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లు స్వీకరించనున్నట్లు.. ఇందుకోసం రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. అనంతరం మొదటి విడత ఎన్నికలు జరగనున్న మండలాల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ మొగులప్ప, డీఎస్పీ నల్లపు లింగయ్య, డీపీఓ సుధాకర్ రెడ్డి, నోడల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తొలివిడత ఎన్నికలు జరిగే మండలాలు, ఎంపీటీసీ స్థానాలు

కోస్గి	గుండుమాల్	మద్దూర్	కొత్తపల్లి	నారాయణపేట
06	06	10	05	17

మరికల్	ధన్వాడ	దామరగిద్ద
11	11	16

వరి కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో 3.12 లక్షల మె.ట. ధాన్యం సేకరణే లక్ష్యం



జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- 117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- 78 లక్షల గన్నీ బ్యాగులు, 3,510 టార్పాలిన్లు అవసరమని అంచనా
- కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు

నర్వ: జిల్లాలో సాగుచేసిన వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు సంబంధిత అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ధాన్యం సేకరణపై ఇప్పటికే కలెక్టర్ ముందస్తు సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ప్రాథమిక సహకార సంఘం, మెప్మా, ఎఫ్‌పీఓ, మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో మొత్తం 117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వారంలో కేంద్రాలు ప్రారంభించే అవకాశం ఉండగా.. వచ్చే నెలలో పంట కోతల ఆధారంగా మిగతా చోట్ల పూర్తి స్థాయిలో ప్రారంభించాలని నిర్ణయించారు.

4.28 లక్షల మె.ట. దిగుబడి..

వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 4.28 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కేంద్రాలు ప్రారంభం కాగానే అవసరాన్ని బట్టి సంచులు తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేంద్రాల ఏర్పాటు ఇలా..

ఐకేపీ	పీఏసీఎస్	మెప్మా	ఎఫ్‌పీఓ
58	52	2	4

అగ్రికల్చర్ మార్కెట్	మొత్తం కేంద్రాలు
1	117

71 వేల హెక్టార్లలో..

జిల్లావ్యాప్తంగా 71,063 హెక్టార్లలో వరి సాగుకాగా.. ఇందులో సన్న రకం 56,082 హెక్టార్లు, దొడ్డురకం 14,981 వేల హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకం క్వింటాకు రూ.2,369 మద్దతు ధర చెల్లించనుంది.

■ జిల్లావ్యాప్తంగా 4.28 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా.. స్థానిక అవసరాలకు 85,767 మెట్రిక్ టన్నులు వినియోగించే అవకాశం ఉంది. మిల్లర్లు, ట్రేడర్లు 30,457 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉండగా.. మిగిలిన 3.126 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని నిర్ణయించింది. ఇందుకుగాను 78.15 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా.. ప్రస్తుతం 19.01 లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా 59.14 కొత్తవి సేకరించాల్సి ఉంది. 3,510 టార్పాలిన్లు అవసరం కాగా.. ప్రస్తుతం 3,029 ఉన్నాయి. కేంద్రాల నుంచి మిల్లులు, గోదాంలకు ధాన్యం తరలింపునకు లారీలు సిద్ధంగా ఉంచేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..



జిల్లాలో వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు 117 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించాం. త్వరలోనే ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే అదనంగా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈసారి 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించాం. – వంగాల బాలరాజు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

దళారులను ఆశ్రయించొద్దు..

వానాకాలం వరి సాగు దిగుబడి అంచనాకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంట కొనుగోళ్లు చేపడతాం. సరిపడా గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు సమకూర్చుతాం. ఈ సీజన్‌కు కూడా సన్నరకానికి బోనస్ ఉంటుంది. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు. – సైదులు, జిల్లా మేనేజర్, పౌరసరఫరాలశాఖ

స్థానికంలో ఆర్వోలదే ప్రధాన భూమిక

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో **రిటర్నింగ్ అధికారులు** ప్రధాన భూమిక **పోషించాల్సి ఉంటుందని కలెక్టర్,** జిల్లా ఎన్నికల **అధికారి సిక్తా పట్నాయక్ అన్నారు.** బుధవారం కలె**క్టరేట్‌లోని సమావేశ మందిరంలో** రిటర్నింగ్ అధి**కారులతో సమావేశం నిర్వహించి** మాట్లాడారు. **జిల్లాలోని 13 జెడ్పీటీసీ, 136 ఎం**పీటీసీ స్థానాలకు రెండు విడతల్లో.. 272 గ్రామపంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను వీడియో తీయించాలని, అభ్యర్థి సంతకం, సరైన ధ్రువపత్రాలు లేకపోతే గుర్తించి సరి చేయాలని, వీలైనంత వరకు తిరస్కరణకు గురికాకుండా చూడాలని సూచించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఒకే వాహనం వచ్చేందుకు అనుమతి ఉంటుందని, గదిలోకి ముగ్గురు కంటే ఎక్కువ మంది వెళ్లడానికి వీలు లేదని స్పష్టం చేశారు. నామినేషన్ల పరిశీలన, అప్పీలు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల బీ-ఫామ్ తదితర విషయాలగ గురించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ క్లుప్తంగా వివరించారు. ఎన్నికల నియమావళిలోని ప్రతి పేజీని క్షుణ్ణంగా చదివి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆర్వోలకు సూచించారు. శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు..

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాలశాఖ, సంస్థ ఆధ్వర్యంలో 2025–26 వానాకాలం వరి ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, ఐకేపీ, మెప్మా, ప్యాక్స్ నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. వ్యవసాయశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్యాక్స్, పోలీసు, ఆర్టీఓ, మార్కెటింగ్, మెప్మా అధికారులు సమన్వయంతో పనిచేయాలని.. బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత సీజన్‌లో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా కొనసాగించాలన్నారు. కొనుగోళ్లలో నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. మండల మానిటరింగ్ కమిటీ ప్రతిరోజు కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేయాలని, ఎన్నికల బాధ్యతలు లేని అధికారులందరూ కేంద్రాలు పరిశీలించాల్సిందేనని చెప్పారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. ఈ నెల రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అంతలోపు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రాల నిర్వాహకులదేనని చెప్పారు. కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం చేరవేసేందుకు ఈసారి ముగ్గురు కాంట్రాక్టర్లు 60 లారీల చొప్పున అందుబాటులో ఉంచుతారని, ముందుగానే లారీల జాబితా ఇస్తే ఆర్టీఓ అధికారులతో పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, అదనపు కలెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, ఆర్డీఓ రాంచందర్ నాయక్, డీఆర్డీఓ మొగులప్ప, డీఎస్పీ నల్లపు లింగయ్య, డీఏఓ జాన్ సుధాకర్, పౌరసరఫరాలశాఖ అధికారులు బాలరాజు, సైదులు, ఆర్టీఓ మేఘాగాంధీ, డీఎంఓ బాలామణి పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి సురవరం

కొల్లాపూర్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మహోన్నత వ్యక్తి అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన జీవితం, ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని, పేదరికం లేని సమాజం కోసం తుదిశ్వాస వరకు పోరాడారని కొనియాడారు. ఆయన ఆలోచనలు, లక్షణాలు, జీవన విధానాలను అనుసరించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఆయన కుటుంబీకులు, బంధువులు నిర్వహించారు. ఈ సభకు హాజరైన మంత్రి జూపల్లి మాట్లాడుతూ కొల్లాపూర్‌లో సురవరం కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం సాధించడంలో సురవరం పాత్ర ఎంతో ఉందన్నారు. నల్లగొండలో ఫ్లోరోసిస్ సమస్యను జాతీయ స్థాయిలో లేవనెత్తి.. ఆ సమస్యకు పరిష్కారం కోసం పోరాడిన గొప్ప నాయకుడు అన్నారు. తెలంగాణ సాధనలోనూ కూడా ఆయన పాత్ర ఉందన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాల్‌నర్సింహ పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రాకు విశేష స్పందన

- రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్



విజేతకు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తున్న ఆర్ఎం సంతోష్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ లక్కీడ్రాకు ప్రయాణికుల నుంచి విశేషమైన స్పందన లభించిందని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. గత నెల 27 నుంచి ఈనెల 6వ తేదీ వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో (ఎలక్ట్రికల్ వాహనాలతో సహా) ప్రయాణించే వారికి లక్కీడ్రా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టీఓ రఘుకుమార్ చేతుల మీదుగా లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటించారు. ప్రథమ శివశంకర్, ద్వితీయ బిందు, తృతీయ మోక్షజ్ఞలు నిలవగా వారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీ సురక్షితమైన ప్రయాణానికి కేరాఫ్‌గా నిలుస్తున్నదన్నారు. దసరా పండుగ రోజుల్లో ఉమ్మడి జిల్లా ప్రయాణికులు ఆర్టీసీని ఎంతో ఆదరించారని తెలిపారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ప్రధాన బస్టాండ్లలో ఏర్పాటు చేసిన 17 బాక్సుల్లో లక్కీడ్రా తీసినట్లు చెప్పారు. మొదటి బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్) లక్ష్మీధర్మ, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గణితమంటే భయం వీడాలి

నారాయణపేట రూరల్: విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టాలని ఎంఈఓలు బాలకిష్టప్ప, బాలాజీ అన్నారు. ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్‌పై జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఉన్న గణితశాస్త్ర ఉపాధ్యాయులకు మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. నారాయణపేట మండలం కోటకొండ, మద్దూరు మండలం పెదిరిపాడు, మక్తల్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రిసోర్స్ పర్సన్లు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్లు మాట్లాడుతూ.. పిల్లలకు గణితంపై భయం పోవాలంటే పుస్తకాలతో కుస్తీ పడకుండా కంప్యూటర్ ద్వారా నేర్చుకోవడంతో ఆకర్షితులవుతారన్నారు. ఏఐ డిజిటల్ కోడింగ్‌లో భాగంగా పైథాన్, జావాపై శిక్షణ తీసుకొని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. శిక్షణ అనంతరం డిజిటల్ పుస్తకాల ద్వారా బేసిక్స్ ప్రాక్టీస్ చేసుకోవాలన్నారు. ఇలాంటి ప్రయోగాలతో పిల్లల్లో ఆలోచన, ఆసక్తి పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు భాస్కర్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


దేవేందర్ (ఫైల్)

ఇటిక్యాల: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్ కథనం ప్రకారం.. మండలంలోని సాతర్లకు చెందిన ఈడిగి దేవేందర్ (35) మతి స్థిమితం బాగలేక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుంటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. బుధవారం మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: పెళ్లయి ఏడాది.. భార్య గర్భిణి.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. రూరల్ 2వ ఎస్‌ఐ భూపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. నవాబ్‌పేటకు చెందిన నరేందర్(20) పాలమూరులోని లక్ష్మీనగర్ కాలనీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఈనెల 7న అర్ధ రాత్రి ఫంక్షన్ హాలులో అతను నివాసముండే గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఏడాది కిందట దేవి అనే యువతితో పెళ్లి కాగా.. ప్రస్తుతం గర్భిణి. కాన్పునకు తల్లిగారింటికి వెళ్లింది. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు భార్యకు ఫోన్ చేసి 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పగా.. దేవి వెంటనే కుటుంబసభ్యులను ఫంక్షన్ హాల్ వద్దకు పంపగా.. అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కోస్గి రూరల్: వ్యవసాయ పొలానికి వెళ్లే దారి విషయంలో దాయాదుల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గుండుమాల్ మండలంలోని అమ్లికుంటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. అమ్లికుంటకు చెందిన మాల అంజిలయ్య తమ వ్యవసాయ పొలంలో కూరగాయల సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పక్క పొలం దాయాదులు పొలంలోకి వెళ్లేదారిని మూసివేశారు. నాలుగు రోజులు గడుస్తున్నా.. వెళ్లనీయకపోవడంతో పొలం దగ్గరున్న గడ్డి మందును తాగాడు. చుట్టుపక్కలవారు గమనించి కోస్గి ఆస్పత్రికి తరలించారు. అంజిలయ్య భార్య అంజిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎనిమిది పాడిఆవుల మృతి



వెల్దండ: మండలంలోని రాచూర్‌తండాలో పాత్లావత్ పర్షనాయక్‌కు చెందిన ఎనిమిది పాడిఆవులు మృతిచెందాయి. రైతు కథనం ప్రకారం.. ఈనెల 3వ తేదీనుంచి ఆవులు ఒక్కొక్కటి మృతి చెందినట్లు వాపోయాడు. రూ.5లక్షలకుపైగానే నష్టం జరిగిందని.. ప్రతిరోజూ పాలుసేకరించి జీవనం సాగిస్తుండగా.. ఒక్కసారిగా ఎనిమిది ఆవులు మృతిచెందడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని తండావాసులు పేర్కొన్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి శ్యామ్‌సుందర్‌ను వివరణ కోరగా.. బీరుపిట్టు, కలుషితదాన, అధిక మోతాదులో ముదురు గడ్డి ఇవ్వడంతో పాటు లవణలోపాల కారణంగా మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతికి కారణాల నిర్ధారణకు మహబూబ్‌నగర్ పశువ్యాధి నిర్ధారణ సంస్థకు రక్తం, పేడ, ధాన, గడ్డి నమూనాలను సేకరించి పరిశీలనకు పంపినట్లు తెలిపారు. మృతిచెందిన ఆవులను పోస్టుమార్టం చేసి పరిశీలించగా కడుపులో జీర్ణంకాని గడ్డి, రక్తంలో మార్పు గమనించినట్లు వివరించారు.

అరుదైన వ్యాధితో చిన్నారి మృతి


విహాన(ఫైల్)

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రానికి చెందిన కోడిగంటి రంజిత్, హైమావతి దంపతుల పెద్దకూతురు కోడిగంటి విహాన(4) అరుదైన వ్యాధితో మృతిచెందింది. విహాన నెల క్రితం ఆటలు ఆడుకుంటూ కింద పడిపోయింది. తల్లితండ్రులు కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పాపకు మైటోకాండ్రియా అనే వ్యాధి సోకిందని వైద్యులు నిర్ధారించారు. తల్లితండ్రులు విరాళాలు సేకరించి వైద్యం చేయించారు. 15రోజుల క్రితం నిమ్స్‌లో చేర్పించి ఇటీవల ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చిన్నారి మృతిచెందింది. రూ.25లక్షల వరకు ఖర్చు పెట్టినా పాప బతకలేదని తల్లితండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బుధవారం సాయంత్రం ఏదులలో నిర్వహించిన అంత్యక్రియలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజుతోపాటు కొత్తకుమార్, గ్రామస్తులు హాజరై విహాన తల్లిదండ్రులను ఓదార్చారు.

నేటి నుంచి నెట్‌బాల్ సమరం

- మరో రాష్ట్రస్థాయి క్రీడలకు పాలమూరు ఆతిథ్యం
- మెయిన్ స్టేడియంలో నిర్వహణ
- మూడు విభాగాల్లో టోర్నీ
- హాజరుకానున్న 1200మంది క్రీడాకారులు


మెయిన్ స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం మరో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు వేదికకానుంది. స్థానిక మెయిన్ స్టేడియంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. మూడు విభాగాల్లో జూనియర్ విభాగం పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ ట్రెడిషనల్, 3వ ఫాస్ట్–5, మొదటి మిక్స్‌డ్ బాల, బాలికల పోటీలు జరగనున్నాయి. 9, 10 తేదీల్లో ట్రెడిషనల్ విభాగం, 10, 11 తేదీల్లో ఫాస్ట్–5, 11, 12 తేదీల్లో మిక్స్‌డ్ విభాగం పోటీలు నిర్వహించనున్నారు.

1200 మంది క్రీడాకారుల రాక

ఈ మూడు విభాగాలకు సంబంధించి రాష్ట వ్యాప్తంగా 1200 మంది బాల, బాలికలు హాజరుకానున్నారు. 130 మంది కోచ్‌లు, మేనేజర్లు, 80 మంది టెక్నికల్ అఫీషియల్స్ రానున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, మంచిర్యాల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మేడ్చల్, జగిత్యాల, మహబూబాబాద్, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, జనగాం, సిరిసిల్ల, వికారాబాద్, పెద్దపల్లి, సూర్యాపేట, సంగారెడ్డి పాల్గొంటున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఉదయంతోపాటు సాయంత్రం వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈనెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నారు.



క్రీడాకారుల వసతి

టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు అంబేడ్కర్ భవన్, స్కౌట్స్ గైడ్స్ భవనం, చైతన్య స్కూల్, లిటిల్ స్కాలర్స్ స్కూల్, మహబూబ్‌నగర్ హై స్కూల్, మా డ్రన్ పాఠశాలలో వసతి, మెయిన్ స్టేడియంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. టోర్నమెంట్ నిర్వహ ణకు మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహిస్తాం. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. – విక్రమాదిత్యరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్

తాగి వేధిస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య

- వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు
- భార్య, బామ్మర్దులు, అత్త రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి: తాగొచ్చి వేధిస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య కేసును రేవల్లి పోలీసులు ఛేదించినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కేసులో భార్య, ముగ్గురు బామ్మర్దులు, అత్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం వెల్లడించారు. రేవల్లి మండలం చెన్నారానికి చెందిన శివలీలతో పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గడ్డం నర్సింహ(35)కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూరుతు ఉంది. నర్సింహ ప్లంబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నాళ్లుగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా రోజూ తాగొచ్చి భార్యను వేధించేవాడు. శివలీల వనపర్తిలోని ఓ క్లాత్‌స్టోర్‌లో పనిచేస్తోంది. భార్య సంపాదనను తాగడానికి ఇవ్వాలని ప్రతిరోజూ గొడవ పడేవాడు. 20రోజుల క్రితం నర్సింహ శివలీలను ఇంటి నుంచి పంపించేయడంతో బామ్మర్ది లోకేశ్ శివలీల, కూతురు దీప్తిని చెన్నారానికి తీసుకెళ్లాడు. శివలీల అక్కడే తల్లితో ఉంటోంది. దసరా సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన శివలీల తమ్ముళ్లు శశికిరణ్, గంగాధర్, లోకేశ్‌కు భర్త వేధింపుల విషయం చెప్పడంతో నర్సింహను హత్య చేయాలని పథకం వేశారు. ఈనెల 3న రాత్రి 10గంటల సమయంలో నర్సింహను చెన్నారం గ్రామానికి పిలిపించి ఫుల్లుగా మద్యం తాగించారు. తర్వాత కళ్లలో కారం పొడి చల్లి, చీపురు కట్ట, డంబెల్‌తో తలపై, వీపుపై బలంగా కొట్టి చంపేశారు. బయటకు అరుపులు వినిపించకుండా ఇంటి బయట స్పీకర్లు పెట్టి జాగ్రత్తలు తీసుకున్నారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారినుంచి సెల్‌ఫోన్లు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అనుమానం పెనుభూతమై..

- కట్టుకున్న భార్యను హతమార్చిన భర్త
- నిందితుడి అరెస్టు.. రిమాండ్
- డీఎస్పీ లింగయ్య వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్: అనుమానంతో కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి హతమార్చిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ ఎన్.లింగయ్య తెలిపారు. బుధవారం మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో హత్యకేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మక్తల్ మండలం సత్యవార్‌కు చెందిన వినోద (35)కు, కర్నూలు జిల్లాకు చెందిన కృష్ణారెడ్డితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఏడాది గడవకముందే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలోనే బతుకుదెరువు నిమిత్తం ఇద్దరు హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ కూడా తరచుగా గొడవ పడుతుండే వారు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో వినోద తండ్రి సత్యారెడ్డి ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చారు. గ్రామంలోనే కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేది. అయితే వినోద భర్త కృష్ణారెడ్డి వారం, పది రోజులకోసారి భార్య వద్దకు వచ్చి వెళ్లేవాడు. ఎప్పుడైనా వినోద ఫోన్ బిజీ వస్తే అనుమానం వ్యక్తంచేస్తూ గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే అనుమానం పెనుభూతమై తన భార్యను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. రెండు, మూడుసార్లు హతమార్చేందుకు విఫలయత్నం చేశాడు. గత నెల 27న దసరా పండుగ నిమిత్తం హైదరాబాద్ నుంచి స్కూటీపై సత్యవార్‌కు వచ్చిన అతడు.. పథకం ప్రకారం పదునైన కత్తి తీసుకొచ్చాడు. ఈ నెల 3న దసరా పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ కలిసి పొలం వద్ద భోజనాలు చేసేందుకు బయలుదేరారు. అయితే తన స్కూటీ టైరులో గాలి తక్కువగా ఉందని పేర్కొంటూ తన కుమారుడు అక్షిత్‌రెడ్డిని అత్తగారి వెంట పంపించాడు. ఆ తర్వాత వినోదను స్కూటీపై ఎక్కించుకొని బయలుదేరిన అతడు.. ఫోన్‌లో తరచుగా ఎవరితో మాట్లాడుతున్నావంటూ మార్గమధ్యంలో గొడవ పడ్డాడు. పథకం ప్రకారం తన వెంట తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడవటంతో పాటు గొంతుకోసి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై మృతురాలి తల్లి సబ్బు తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బుధవారం మహబూబ్‌నగర్‌లో నిందితుడిని పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్య చేసేందుకు ఉపయోగించిన స్కూటీ, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతడిపై హైదరాబాద్‌లోని పలు పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు ఉన్నాయన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాంలాల్, ఎస్‌ఐలు భాగ్యలక్ష్మీరెడ్డి, అశోక్‌బాబు, సిబ్బంది అశోక్, నరేశ్, శ్రీకాంత్, శశిధర్‌గౌడ్, శ్రీహరిగౌడ్ ఉన్నారు. నాలుగు రోజుల్లో నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు



మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డిలో పిచ్చికుక్క దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడిన బుధవారం చోటుచేసుకున్నది. బుధవారం ఉదయం గ్రామంలో ఓ పిచ్చికుక్క వీధుల వెంట వెళ్లి ఇళ్ల పరిసరాల్లో ఉన్న షాలిని, తిమ్మప్పతోపాటు మరో ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచింది. గాయపడిన వారిని వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించారు. గాయపరిచిన పిచ్చికుక్కను గ్రామస్తులు దాడిచేసి చంపేశారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఐటీ దాడులు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న వీకేర్ సీడ్స్ కంపెనీపై ఏపీ, తెలంగాణకు చెందిన ఐటీ అధికారుల మంగళవారం నిర్వహించిన దాడులు బుధవారం కొనసాగాయి. రెండోరోజు ఏకధాటిగా దాడులు కొనసాగుతున్నాయని, అధికారులు ఎలాంటి సమాచారం తెలుపకపోవడం గమనార్హం.

మహిళ మృతిపై కేసు నమోదు

గోపాల్‌పేట: మహిళ మృతిచెందిన విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఏదులకు చెందిన కాతోజు గీత(32), రామాచారి భార్యాభర్తలు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంటివద్ద భార్యాభర్తలకు చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది. క్షణికావేశానికి గురైన గీత ఇంట్లోకి వెళ్లి టర్పెంట్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తాళలేక అరుస్తూ బయటికి వచ్చింది. గమనించిన భర్త, పక్కన ఉన్నవారు మంటలను ఆర్పి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందింది. ఈ విషయంపై మృతురాలి అన్న నర్సింహాచారి బుధవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రియాంక మృతిపై న్యాయ విచారణ చేయాలి

గద్వాల క్రైం: కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన చెందిన ప్రియాంక మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని బుధవారం కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి, రాంబాబు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4న ప్రియాంక విషపు గుళికలు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతురాలి నడుము వద్ద మత్తు లేదా పాయిజన్ ఇంజెక్షన్ ఇవ్వడంతోనే మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈ విషయమై డీఎస్పీ మొగిలయ్య మాట్లాడుతూ ప్రియాంక కేసు విషయంలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. గద్వాలకు వస్తున్న క్రమంలో ఏమైనా ఇబ్బందులు వచ్చాయా.. రోడ్డు మార్గంలో ఆలస్యం తదితర విషయాలపై ఆరా తీస్తామన్నారు. ప్రియాంక ఆత్మహత్యకు ఎవరైన ప్రేరేపించారా.. లేక రఘునాథ్‌గౌడు కు టుంబ సభ్యులు బెదిరింపులకు పాల్పడ్డారా.. మధ్యవర్తులుగా వ్యవహరించిన వ్యక్తుల చేతుల్లో మోసపోయిందా.. ఆర్థికపరమైన రాజీ చేయాలనే ఉద్దేశంతో ఈ ఘటనలు జరిగాయా.. అనే కోణాల్లో విచారణ జరుగుతుందన్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు రావాల్సి ఉందని, వాటి ఆ ధారంగా విచారణ చేస్తామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు రిమాండ్‌లో ఉన్నాడని, త్వ రలోనే మరికొందరిపై విచారణ చేపట్టి వారిని సైతం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు.

బండరాయి పైనుంచి పడి ఇద్దరు కూలీల మృతి


కురుమూర్తి (ఫైల్)


యాదప్ప (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: జీవనోపాధికి వచ్చి.. ప్రమాదవశాత్తు రాయి మీద నుంచి కిందపడి ఇద్దరూ వడ్డెర కూలీలు మృతిచెందినట్లు కోయిలకొండ ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన పెద్ద మౌలాలీ(50), వనపర్తి మండలం కిష్టగిరికి చెందిన వడ్డె కురుమూర్తి(28) కుటుంబాలతోపాటు మరో రెండు కుటుంబాలు కలిసి మూడేళ్ల కిందట కోయిలకొండ మండలం అమరనాయక్‌తండా సమీపంలో ఇళ్లను అద్దెకు తీసుకుని పంట పొలాలు, గుట్టలో రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద మౌలాలీ, కురుమూర్తి పెద్దగుండుపై రాళ్లు తొలుస్తుండగా.. గుండుజారీ కిందపడడంతో పెద్దమౌలాలీ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన కురుమూర్తిని జిల్లా ఆస్పత్రికి తరలించగా రాత్రి 8:30ప్రాంతంలో మృతిచెందాడు. పెద్దమౌలాలీకి భార్య, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. కురుమూర్తికి భార్య ఉన్నది. బుధవారం మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ముంబైలో వలస కూలీ మృతి

నారాయణపేట రూరల్: పొట్టకూటి కోసం వలస వెళ్లిన కూలీ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. గ్రామస్తులు కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా కోటకొండకు చెందిన కావలి యాదప్ప(45) రెండు దశాబ్దాలకుపైగా ముంబైలో కూలీ పనిచేస్తున్నాడు. సోదరుడు నర్సింహులు వెంట వెళ్లి పని నేర్చుకుని అక్కడే ఉంటున్నాడు. 18ఏళ్ల కిందట నర్సింగమ్మతో పెళ్లి కాగా కూతురు, కూమారుడు ఉన్నారు. కూతురు ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కూమారుడు ఏడో తరగతి చదువుతున్నారు. భార్యాపిల్లలు స్వగ్రామంలో ఉండగా పెళ్లి తర్వాత ముంబైలోని అంధేరిలో ఉంటూ మేస్త్రి కింద భవన నిర్మాణ పనులకు వెళ్తుండేవాడు. బుధవారం 14వ అంతస్తులో ప్లాస్టర్ పనిచేస్తుండగా పరంచ కర్ర విరిగి కిందపడ్డాడు. సేఫ్టీబెల్ట్ లేకపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ముంబై వెళ్లారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎనిమిది నెలల క్రితమే కూతురు న్యూరో సంబంధిత వ్యాధితో బాధ పడుతుండగా రూ.3లక్షల వరకు అప్పు చేసి చికిత్స చేయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అప్పు తీర్చేందుకే మళ్లీ ముంబై వెళ్లాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు ఇంటర్ యూనివర్సిటీ యోగా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ, సౌత్‌జోన్ టౌర్నమెంట్‌కు యోగా బాల, బాలికల జట్ల ఎంపికలను ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పీయూ ఇండర్ స్టేడియంలో నిర్వహించే ఎంపికల్లో పాల్గొనేవారు కళాశాల నుంచి ఎలిజిబిలిటీ సర్టిఫికేట్, ప్రతి కళాశాల నుంచి కేవలం ఐదుగురు మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఇక్కడ ఎంపికైనవారు వేల్స్ యూనివర్సిటీ చెన్నై, స్వయస యూనివర్సిటీ కర్ణాటకలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారని పేర్కొన్నారు. జట్ల ఎంపిక కార్యక్రమానికి వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు పాల్గొనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ కబడ్డీ జట్టు ఎంపికలు


కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈఓ కౌసర్ జహాన్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాల, బాలికల కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించారు. డీఐఈఓ కౌసర్ జహాన్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి అండర్–19 కబడ్డీ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ.. ఎంపికల్లో 80మంది బాల, బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో 12మంది బాలుర, 12మంది బాలికలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలో ఈనెల 10నుంచి 12వరకు రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాల్‌రాజు, జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, మేరీపుష్ప, శ్రీనివాసులు, రమేశ్, మోహన్, భారతి తదితరులు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లా అండర్–19 బాలుర జట్టు

వి.చందు (కెప్టెన్), బి.ఆంజనేయులు, బి.హర్షవర్ధన్, ఎన్.శ్రీకాంత్, ఎస్.దత్తాత్రేయ, ఎం.రాంచరణ్, జె.అనిల్‌కుమార్, హన్మంతు, వి.గౌతం, విక్రమ్ నాయక్, ఎస్‌కె.రాజు, సి.భాస్కర్.

- **బాలికల జట్టు:** జె.గంగ (కెప్టెన్), కె.భవాని, ఎం.నందిని, పి.సింధూజ, పి.శివానీ, బి.జ్యోత్స్న, ఎస్.సింధు, నాగప్రత్యూష, పి.ఇందేశ్వరి, గాయత్రి, గౌరి, మౌనిక.

జూరాలకు నిలకడగా వరద

- ప్రాజెక్టుకు 85 వేలక్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 5గేట్ల ద్వారా శ్రీశైలానికి 81వేల క్యూసెక్కుల విడుదల


శ్రీశైలం ఆనకట్ట వద్ద మూసివేసిన గేట్లు


జూరాల ప్రాజెక్టులోని స్పిల్‌వే నుంచి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

గద్వాల: జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో వరదనీరు కొంతమేర తగ్గుముఖం పట్టినప్పటికీ నిలకడగా కొనసాగుతుంది. బుధవారం ప్రాజెక్టులోకి 85,000 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతుండగా 5గేట్లు ఎత్తి 81,804 క్యూసెక్కులను దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. జలవిద్యుదుత్పత్తి కేంద్రానికి 44,310 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు (1044.488అడుగులు)కాగా ప్రస్తుతం 9.255టీఎంసీల నీటిని నిల్వ చేశారు. సాగునీటి ప్రాజెక్టులైన నెట్టెంపాడు, భీమా లిఫ్ట్–1, 2, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, సమాంతర కాల్వలకు నీటిని నిలిపి వేశారు. జూరాల ఎడమ కాల్వకు 1030క్యూసెక్కులు, కుడికాల్వకు 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకేసులకు స్వల్పంగా ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 11,250 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును మీటర్ మేర మరో గేటును అరమీటర్ మేర తెరిచి 6,710 క్యూసెక్కులను వదిలినట్లు ఆయన తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదలడంతో డ్యాం నుంచి మొత్తం 9,155 క్యూసెక్కులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు బుధవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 393.855 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 381.838 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 775.693 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

శ్రీశైలం గేట్లు మూసివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తిన ఆరు గేట్లను బుధవారం మూసివేశారు. జూరాలలో స్పిల్‌వే ద్వారా 35,794, విద్యుదుత్పత్తి చేస్తూ 44,310, సుంకేసుల నుంచి 6,710, హంద్రీ నుంచి 250 మొత్తం 87,064 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వస్తున్నది. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,833 మొత్తం 66,148 క్యూసెక్కుల నీళ్లను సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.4 అడుగుల వద్ద 212.4385 టీఎంసీల నిల్వ ఉంది. గత 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5వేలు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,830, ఎంజీకేఎల్‌ఐకి 1,390 క్యూసెక్కులను విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.097 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.304 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సంక్షేమం అమలులో ప్రభుత్వం విఫలం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం అమలులో విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు రైతు భరోసా కింద రూ.12వేలు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. ఇందిరా మహిళా శక్తి కింద లబ్ధిదారుల ఎంపికలోనూ తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు 120 గజాల ప్రభుత్వ స్థలం కేటాయించడంతోపాటు ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలన్నారు. ఆసరా పింఛను రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల చరిత్ర తలదించుకోవడం తప్పా.. తలెత్తుకునేలా లేదన్నారు. కోర్టులో న్యాయమూర్తిని చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించడం వారి నైతికతకు నిదర్శనమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్, మోహన్, హన్మంతు, రాములు, పాండు, శివలీల, యాదయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్రాములు